క్లుప్తంగా

దాహార్తి తీర్చేందుకు చర్యలు



నీటి నిల్వ కోసం నిప్పులవాగుపై వేసిన అడ్డుకట్టను చూపుతున్న సర్పంచు మాణిక్యమ్మ

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో సర్పంచు మాణిక్యమ్మ ప్రజలు, పశువుల దాహార్తి తీర్చేందుకు బుధవారం చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలో చలి వేంద్రం, సుంకులమ్మ గుడి వద్ద ట్రాక్టర్‌తో నీళ్ల ట్యాంకును ఏర్పాటు చేశారు. అలాగే గ్రామంలో భూగర్భ జలాలు పెంచడానికి, పశువులకు తాగునీటికై గ్రామం లోని నిప్పుల వాగులో అడ్డుకట్ట వేసి నీటిని నిలిపారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో బోరు బావుల్లో నీరు ఇంకి పోకుండా నిప్పుల వాగులో అడ్డు కట్ట వేశామన్నారు. అంతే కాకుండా పలు సీజనల్ బోర్లకు ఇప్పటికే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చామన్నారు.

రంజాన్‌కు ఈద్గాలు ముస్తాబు



పాములపాడు ఈద్గాకు రంగులు వేస్తున్న యువకులు

పాములపాడు: రంజాన్ మాసం ప్రారంభం నుంచి ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు నేడు రంజాన్ పండుగను జరుపుకోనున్నారు. కొన్ని ప్రాంతాల్లో బుధవారం రాత్రి నెలవంక కనిపించలేదని, అయితే ఈ నెలను 30 రోజులుగా ప్రకటిస్తూ ఏప్రిల్ 11న షవ్వాల్ నెల ప్రారంభం అవుతుందని నిర్ణయిస్తూ ముఫ్తీ ఇమారతెషర్ ఇయ్యాహ్ విజయవాడ షేక్ నిషార్ అహ్మద్‌ఖాస్మి ప్రకటించడంతో గురువారం రంజాన్ పండుగను జరుపుకోవాలని అన్ని మసీదుల్లో ప్రకటించారు. దీంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేసుకున్నారు. ఇందులో భాగంగా ఈద్గాలకు రంగులు వేయడం జరిగింది. అంతే కాకుండా ఎండలు ఎక్కువగా ఉండటంతో షామియానాలు, తాగడానికి, ఉజూ చేసుకునేందుకు నీటి వసతులు ఏర్పాట్లు చేశారు.

అప్రమత్తతతో తప్పిన ట్రాఫిక్ గండం



డ్రోన్ కెమెరా ద్వారా ట్రాఫిక్ జామ్ ప్రదేశాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

శ్రీశైలం: శ్రీశైలంలో ఉగాది బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరిగాయి. పండుగ రోజున దాదాపు 8,200 వాహనాలు శ్రీశైలానికి చేరుకున్నాయి. రద్దీకి అనుగుణంగా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఎప్పటి కప్పుడు పోలీసు శాఖను అప్రమత్తం చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా భక్తులకు తిరుగు ప్రయాణం సాఫీగా సాగింది. ఉగాది రోజున సాయంత్రం శ్రీభ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి రథోత్సవ కార్యక్రమం ముగిసిన అనంతరం ఒక్కసారిగా పెద్ద మొత్తంలో భక్తులు తిరుగుప్రయాణం చేస్తారనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల వైపు ఉన్న అన్ని ట్రాఫిక్ పాయింట్లను అప్రమత్తం చేశారు. స్వయంగా డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తూ.. పోలీసు అధికారులకు అప్పటికప్పుడూ ఆదేశాలిస్తూ ట్రాఫిక్ జాం జరగకుండా నియంత్రించారు.

నెలాఖరులోపు పన్ను చెల్లిస్తే 5 శాతం డిస్కౌంట్



మాట్లాడుతున్న కమిషనర్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: ఈ నెల 30వ తేదీ లోపు ఇంటి పన్నులు, ఖాళీ స్థల పన్నులు చెల్లిస్తే నూటికి రూ.5 డిస్కౌంట్ ఇవ్వడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–25 సంవత్స రం సంబంధించిన ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్నులు చెల్లించేవారికి నూటికి రూ.5లు డిస్కౌంట్ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: మండలపరిధిలోని తలముడిపి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ బుధవారం తెలిపారు. తలముడిపి గ్రామానికి చెందిన రాజుగౌడ్ అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

కొలిచిన వారి కొంగుబంగారం శ్రీలక్ష్మీరంగనాథస్వామి

- తర్తూరులో ఈనెల 16నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు
- 23న స్వామివారి రథోత్సవం
- వ్యవసాయ పనిముట్లకు ప్రసిద్ధి



తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి ఆలయం



స్వామివారి చెక్క విగ్రహం





ఆలయంలో కొలువుదీరిన శ్రీరంగనాథస్వామి, లక్ష్మీదేవి అమ్మవారి మూలవిగ్రహాలు

జూపాడుబంగ్లా: ఎనిమిది శతాబ్దాల క్రితం చెక్కబొమ్మరూపంలో దర్శనమిచ్చిన స్వామివారిని నమ్మికొలిచిన వారికి కొంగుబంగారమై తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి కలియుగ ఆరాధ్యదైవంగా విరాజిల్లుతున్నాడు. నమ్మిన భక్తులకు, అన్నదాతలకు ఆరాధ్యదైవమై వెలుగొందుతూ పాడిపంటలు వృద్ధచెంది, ఆయురారోగ్యాలతో తూలతూగేలా ఆశీర్వదిస్తున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే తర్తూరు జాతరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో ఎంతో పేరుంది. జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

ఆలయచరిత్ర

సుమారు 727 ఏళ్లక్రితం కర్నూలు–గుంటూరు రహదారికి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న జూపాడుబంగ్లా మండలంలోని తర్తూరు గ్రామంలోని ఉల్పా వంశానికి చెందిన రాజారెడ్డి అనే వ్యక్తికి మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు మండలం, శ్రీరంగాపురం గ్రామానికి చెందిన రంగమ్మ అనే మహిళతో వివాహం జరిగింది. ప్రతి ఏటా హోలీపున్నమినాడు శ్రీరంగాపురంలో జరిగే శ్రీలక్ష్మీరంగనాథస్వామి వారి ఉత్సవాలకు ఆదంపతులు వెళ్లేవారు. వేడుకల అనంతరం ఆడబిడ్డకు పుట్టింటివారు ఒడిబియ్యం పెట్టడం ఆనవాయితీగా ఉండేది. ఆన వాయితీ ప్రకారం పుట్టింటివారు రంగమ్మకు ఒడిబియ్యం పెట్టి పండంటి బిడ్డపుట్టాలని బియ్యంలో ఆడరూపంలో ఉన్న ఓ చెక్కబొమ్మను పెట్టేవారు. తర్తూరుకు వచ్చిన అనంతరం ఆదంపతులు ఒడిబియ్యాన్ని విప్పిచూడగా అందులో ఆడరూపంలో ఉన్న బొమ్మ మగరూపంలోకి మారేది. దీంతో మెట్టింటివారు కోడలిని మందలించేవారు. అలాగే ఏటా వారి వంశస్తులు ఎవరో ఒకరు చనిపోవడంతో పాటు అనారోగ్యాలకు గురయ్యేవారు. ఇలా మూడు, నాలుగు పర్యాయాలు జరగడంతో కోపంతో వారు చెక్కబొమ్మను పశువులగాడిలోకి విసిరివేయటంతో స్వామివారు పూనకం వచ్చి తాను శ్రీరంగనాథస్వామివారినని పేర్కొన్నారు. తాను తర్తూరులోనే కొలువుంటానని, తనకు ఏటా జాతర నిర్వహించి భక్తిశ్రద్ధలతో కొలిస్తే అష్టఐశ్వర్యాలు ప్రసాదించడంతో పాటు వారికి పాడిపంటలు వృద్ధి చెంది, వంశాభివృద్ధి జరుగుతుందని ఆశీర్వదించారు. అప్పటినుంచి ఉల్పా వంశస్తులు స్వామివారు కొలువుదీరిన ఇంటితో పాటు 60 ఎకరాల పొలాన్ని స్వామివారికి దారాదత్తం చేసి ఏటా జాతర నిర్వహించేవారు. అలా ప్రారంభమైన జాతర ఏటేటా వృద్ధి చెంది ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో పేరొందింది.

23న రథోత్సవం

ఈనెల 16 నుంచి ప్రారంభమయ్యే తర్తూరు శ్రీలక్ష్మీ రంగనాథస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 23న స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ తెలిపారు. ఈనెల 16న పూలచప్పరం, 17న సింహవాహన సేవ, 18 హంససేవ, 19న నాగేంద్రునిసేవ (శేష వాహనసేవ), 20న హనుమద్వాహనసేవ, 21న గరుడసేవ, 22న గజవాహనసేవ, 23న స్వామివారి రథోత్సవం, 24న అశ్వవాహనసేవ(పారువేట), 25న వసంతోత్సవం(తీర్థావళి)తో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

➤ జాతర ప్రత్యేకత

తర్తూరు జాతర అనగానే కలప, ఎద్దుల విక్రయాలకు ఎంతో ప్రసిద్ధి. ఈ జాతరలో కడుపేదవాడి నుంచి ధనికుని వరకు అవసరమైన వంటింటి, వ్యవసాయ పనిముట్లు లభిస్తాయి. పదేళ్ల నుంచి జాతరలో కలపవిక్రయాలను అటవిశాఖ అధికారులు నిషేధించటంతో కలప విక్రయాలు తగ్గిపోయాయి. వాటిస్థానంలో ఇనుముతో తయారుచేసిన వ్యవసాయ పనిముట్లు అందుబాటులోకి వచ్చాయి. అనుమతి ఉన్న కలపడిపో వారు మాత్రమే చెక్కతో తయారుచేసిన పరికరాలు తెచ్చి జాతరలో విక్రయిస్తుంటారు.

➤ నోరూరించే మాంసం కడ్డీలు

తర్తూరు జాతరలో విక్రయించే కడ్డీల మాంసం ఎంతో పేరొందటంతో భలే గిరాకీ ఉంటుంది. ఈ మాసంపు కడ్డీలను తినటానికి భక్తులు ప్రత్యేకంగా జాతరకు వస్తుంటారంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ విక్రయించే మాంసాన్ని దేవుని ప్రసాదంగా భావించి ఇళ్లకు తీసుకెళ్లి ఆరగిస్తుంటారు.

➤ కళతప్పుతున్న జాతర

15 ఏళ్లక్రితం వరకు తర్తూరుజాతర నెలరోజుల పాటు జరిగేది. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు, రైతులు భారీ సంఖ్యలో వచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకోవటంతో పాటు వారికి అవసరమైన వ్యవసాయ పనిముట్లు, ఎద్దులు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం జాతరలో కలప విక్రయాలు జరగకుండా, రైతులు ఎద్దులబండ్లపై రాకుండా అటవీశాఖ అధికారులు అటకాయిస్తుండటంతో క్రమేణా జాతర కళతప్పుతోంది.

రంజాన్ శుభాకాంక్షలు



బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



డాక్టర్ దారా సుధీర్

నందికొట్కూరు: ముస్లిం సోదరులకు ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు ఎంతో కఠినంగా ఉపవాసం చేసి దీక్షను విరమిస్తున్న సందర్భంగా అభినందనలు తెలిపారు. అల్లాహ్ కృప అందరిపై ఉండాలని, అందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

నేడు ఈద్ ఉల్ ఫితర్



విద్యుత్ దీపాలతో అలంకరించిన మసీదు

ఆత్మకూరు: పట్టణంలో రంజాన్ వేడుకలకు ముస్లిం సోదరులు గురువారం అంగరంగ వైభవంగా జరుపుకోనున్నారు. ఉదయం 11 గంటలకు ప్రార్థనా మందిరాల వద్ద స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి, సోదరుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డిలు ముస్లిం సోదరులకు సంప్రదాయరీతిలో శుభాకాంక్షలు తెలుపనున్నారు. ఇప్పటికే పట్టణంలో ముస్లింలు పండగకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నంద్యాల టర్నింగ్ వద్ద ముస్లిం సోదరులు శుభాకాంక్షలు తెలుపుకునేందుకు వేదికను ఏర్పాటు చేశారు. అన్ని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మహానంది భక్తజనసంద్రం



కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

- క్షేత్రానికి పోటెత్తిన కన్నడిగులు
- రెండ్రోజుల పాటు నిరంతర దర్శనం
- రెండు వైపులా కిక్కిరిసిన పార్కింగ్ స్థలాలు



మహానంది ఆలయం ముందు భక్తజనం



దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

మహానంది: మహానంది ఆలయానికి బుధవారం కన్నడ భక్తులు పోటెత్తారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం రాత్రి వరకు రెండ్రోజుల పాటు మహానందీశ్వరుడి దర్శనం నిర్విరామంగా సాగింది. లక్షలాది సంఖ్యలో కన్నడిగులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు భక్తజనసంద్రంగా మారాయి. భక్తులరద్దీకి అనుగుణంగా ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ సిబ్బందికి పలు సూచనలిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులరద్దీ అధికం కావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అంత మందిలో వెళ్లలేని పలువురు భక్తులు ఆలయం రాజగోపురం, ముఖద్వారం నుంచే మహానందీశ్వరుడిని నమస్కరిస్తూ వెనుదిరిగి వెళ్లారు. నంద్యాల, గాజులపల్లె వైపు ఏర్పాటు చేసిన రెండు టోల్ గేట్లు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. ఆలయానికి దగ్గర్లోనే పార్కింగ్ ఏర్పాటు చేయడంతో భక్తులు సులువుగా ఆలయానికి వచ్చారు. డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కన్నడ భక్తుల సేవలో...



బుక్కాపురం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

మహానంది: ఉగాది ఉత్సవాల సందర్భంగా మహానంది ఆలయానికి లక్షలాదిగా తరలివచ్చిన కన్నడ భక్తులకు దాతలు తమ వంతు సేవలు అందించారు. బెంగళూరుకు చెందిన శంకర్, మిత్ర బృందం ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు మజ్జిగ పంపిణీ చేశారు. వీరు తొమ్మిదేళ్లుగా నిరంతరంగా సేవలు అందిస్తున్నారు. వీరితో పాటు మహానంది, నంద్యాలకు చెందిన పలువురు దాతలు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. బుక్కాపురం వద్ద తిమ్మాపురం జెడ్పీ పాఠశాల 2005వ సంవత్సరం పూర్వ విద్యార్థులు కన్నడ భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భగవాన్ దాస్, ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు

మహానంది: అల్లినగరం గ్రామానికి చెందిన కాశయ్య విద్యుత్ పనులు చేస్తుండగా షాక్‌కు గురవ్వడంతో తీవ్ర గాయాలైన ఘటన బుధవారం బుక్కాపురం, తమ్మడపల్లె శివారులో చోటు చేసుకుంది. కాశయ్య ఎడ్జ్ ఫీజు వేయడానికి వెళ్లగా.. బుక్కాపురం సమీపంలోని ఓ రైస్‌మిల్ వద్ద పిన్ బైండింగ్ వైరు గాలికి ఊడి లైన్లకు తగిలి షాక్‌కు గురయ్యాడు. గాయపడిన కాశయ్యను వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మండల అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు.

ఆదర్శప్రాయుడు శ్రీరామచంద్రమూర్తి

నంద్యాల(వ్యవసాయం): మనిషిగా పుట్టి సమాజంలో ఎలా నడుచుకోవాలో తాను ఆచరించి చూపి శ్రీరామచంద్రుడు ఆరాధ్య దైవమయ్యారని సంస్కృత పండితుడు డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ రామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమం మొదటి రోజు శ్రీరామనవమి విశిష్టత గురించి భక్తులకు వివరించారు.

తిరునాలకు ఆలయాల ముస్తాబు



వేణుగోపాల స్వామి, మల్లేశ్వరస్వామివార్ల తిరునాళ్లకు ముస్తాబైన ఆలయం

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ లక్ష్మీసమేత వేణుగోపాల స్వామి, శ్రీ పార్వతీ సమేత మల్లేశ్వర స్వామివార్ల తిరునాలకు ఆలయాలు బుధవారం ముస్తాబయ్యాయి. ఆలయాలను దేవదాయ శాఖ వారు విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సర చైత్ర శుద్ధ విదియలు బుధవారం మొదలై చైత్ర శుద్ధషష్ఠి ఆదివారం స్వామివార్ల కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఈఓ కార్తీక్, ధర్మకర్తల మండలి చైర్మన్ బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. 10 వతేదీ రాత్రి 12 గంటలకు శ్రీ వారి కల్యాణోత్సవం, 11న రాత్రి 10 గంటలకు స్వామివారి ప్రభోత్సవం, 10.30 గంటలకు కాడి, గిరక, బండి లాగుట, బండి చక్రములు విడదీసి తగిలించుట పందెములు జరుగునని తెలిపారు. 12న సాయంత్రం 4 గంటలకు స్వామివారి రథోత్సవం, 10 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 13న పారువేట ఉత్సవం, 14న తీర్థావళి, వసంతోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. కార్యక్రమాలు అన్ని దుద్యాల గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరా?



ఏఈ శివకుమార్‌ను నిలదీస్తున్న ఎస్సీ కాలనీవాసులు

పగిడ్యాల: ఇరవై రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్‌పై పడమర ప్రాతకోట ఎస్సీ కాలనీవాసులు ఆగ్రహావేశాలను వ్యక్తం చేశారు. బుధవారం కాలనీలో పర్యటించిన అధికారులను నిలదీసి ప్రశ్నల వర్షం కురిపించారు. గొంతెండి అల్లాడిపోతున్నా పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని ధ్వజమెత్తారు. గ్రామ సర్పంచ్ కూడా నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని దీంతో నీటి అవసరాలు పెరిగాయని మండిపడ్డారు. దీంతో స్పందించిన ఏఈ శివకుమార్ సమస్య తీవ్రతను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని, కొత్త బోరుకు ప్రతిపాదనలు పంపి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని కాలనీవాసులకు భరోసా ఇవ్వడంతో వారు శాంతించారు. ఏఈ వెంట సచివాలయ కార్యదర్శి ఇషాంబాషా, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రూ. 1.20లక్షలు స్వాధీనం

మహానంది: గాజులపల్లె చెక్‌పోస్టు వద్ద ప్రకాశం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ. 1.20లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం రాంపురం గ్రామానికి చెందిన మహేశ్వరరెడ్డి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే ఆస్పత్రి అవసరాల నిమిత్తం నగదు తీసుకెళ్తుండగా పోలీసులు కారులో తనిఖీ చేశారు. నగదు ఉండగా ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని ట్రెజరీలో అప్పగించినట్లు వెల్లడించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



గువ్వలకుంట్లలో ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఎండలు తీవ్రతరం కావడంతో పలు గ్రామాలలో నీటి ఎద్దడి మొదలైంది. దీంతో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా గువ్వలకుంట్ల గ్రామంలో బుధవారం సర్పంచు మశమ్మ, ఎంపీటీసీ సోమల ప్రవంతిల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, రామిరెడ్డి ట్యాంకర్ల ద్వారా గ్రామంలో నీటి సరఫరా చేస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారు. ఇంతకు మునుపు గ్రామం నలుమూలల ఎన్నో బోర్లు వేసినప్పటికీ నీరు పడక పోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడకుండా చూసేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నామని వారు చెప్పారు. నాయకులు మహేశ్వర రెడ్డి, లోకేశ్వరరెడ్డిలు ఉన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

పాములపాడు: పవిత్ర రంజాన్ మాసంలో నిష్ఠనియమాలతో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి అన్నారు. రంజాన్ మాసం చివరి రోజైన బుధవారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. తానే స్వయంగా భోజనం వడ్డించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో కుల మతాలకతీతంగా ప్రజలందరూ కలిసి మెలిసి ఉంటున్నారన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల ఒకరి పట్ల మరొకరికి ప్రేమ, ఆప్యాయతలు పెరుగుతాయని చెప్పారు. అల్లా దయ వల్ల అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హాజిరాబీ, సర్పంచు వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, ఉబేదుర్, మాలిక్, షఫి, ముక్తార్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రాతిదూలం పోటీలు ప్రారంభం

పాణ్యం: ఉగాదిని పురస్కరించుకుని మండలంలోని కొత్తూరు సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ సమీపంలో బుధవారం రాతిదూలం పోటీలను పాణ్యం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్య నారాయణరెడ్డి ప్రారంభించారు. విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ. 15వేలు, రూ.12 వేలు, రూ.10వేలు, రూ.8 వేలు, రూ.5 వేల చొప్పున అందజేయనున్నారు.

దేవస్థాన వైద్యశాలకు వెంటిలేటర్ విరాళం



వెంటిలేటర్‌ను దేవస్థాన వైద్యులకు అందజేస్తున్న సహాయ కార్యనిర్వహణాధికారి మోహన్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన వైద్యశాలకు మధ్యప్రదేశ్‌కు చెందిన సునీల్‌కుమార్ భరద్వాజ్ అనే భక్తుడు ట్రాన్స్‌పోర్టు వెంటిలేటర్ విరాళంగా ఇచ్చారు. బుధవారం వెంటిలేటర్ శ్రీశైల దేవస్థానానికి చేరింది. మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తుల ఆరోగ్య అవసరాల కోసం శ్రీశైల దేవస్థానం వైద్యశాలను నిర్వహిస్తుంది. ఇటీవల మల్లన్న దర్శనానికి వచ్చిన సునీల్‌కుమార్ భరద్వాజ్ దేవస్థాన వసతి విభాగ సహాయ కార్యనిర్వహణాధికారి ఐ.ఎన్.వి. మోహన్‌ను కలిశారు. ఆయన దేవస్థాన వైద్యశాలకు వెంటిలేటర్ విరాళంగా అందిచాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే స్పందించిన సునీల్‌కుమార్ శ్రీశైల దేవస్థానం పేరుతో సుమారు రూ.5లక్షల విలువ చేసే వెంటిలేటర్‌ను బుక్ చేశారు. ఈ వెంటిలేటర్ హాస్పిటల్‌లో, అంబులెన్స్‌లో కూడా వినియోగించవచ్చు.

కందిపప్పుపై రంజాన్ శోభ



కందిపప్పుపై ప్రార్థనలు చేస్తున్న చిత్రం

నంద్యాల(అర్బన్): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ కందిపప్పు గింజపై రంజాన్ శోభను చిత్రించారు. ఒక ముస్లిం అల్లాను ప్రార్థిస్తుండగా నెలవంక, మసీదును చిత్రించారు.

ఓటు హక్కు వినియోగంపై రేపు ర్యాలీ

నంద్యాల(సిటీ): ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ రానున్న సార్వత్రిక ఎన్నికలలో తమ విలువైన ఓటును వినియోగించుకోవాలని శుక్రవారం పట్టణంలో చేపట్టే అవగాహన ర్యాలీని జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీ మున్సిపల్ కార్యాలయం నుంచి సంజీవనగర్ వరకు నిర్వహించే ర్యాలీలో మున్సిపల్ కార్యాలయ, ఇండోర్, అవుట్ డోర్ సిబ్బంది పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.